ఆరోగ్యంతో సెల్‌గాటం

- నివాసాల మధ్య సెల్ టవర్ల ఏర్పాటు
- ప్రజల ఆరోగ్యంపై రేడియేషన్ ప్రభావం
- చర్యలు తీసుకోని అధికారులు

చాగల్లు: ప్రజల దైనందిన జీవితంలో గాలి, నీరు, ఆహారం ఎంత అవసరమో.. వాటికి మించి సెల్‌ఫోన్ వినియోగం అత్యవసరంగా మారిపోయింది. సాంకేతిక విప్లవంతో సెల్‌ఫోన్ వినియోగం ఈ ప్రపంచాన్ని ఎంతో సౌకర్యవంతంగా, చిన్నదిగా మార్చేసింది. సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో సెల్‌ఫోన్ అన్ని తానై వ్యవహరిస్తుంది. ఫోన్‌లో బ్యాంక్ ఖాతా నంబర్, డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు, రేషన్ కార్డు, ఓటు గుర్తింపు కార్డు, ఇతర సర్టిఫికెట్లు తదితర ముఖ్యమైన సమాచారం నిక్షిప్తం చేసుకోనే వెసులుబాటు ఉంది. అయితే ప్రజల మనుగడపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. టవర్ల నుంచి అతి తక్కువ రేడియేషన్ విడుదల చేస్తున్నామని, రేడియో ధార్మిక ప్రభావం ఉండదని ప్రైవేటు సెల్ ఆపరేటర్లు చెబుతున్నా.. అవన్నీ వాస్తవ దూరాలే. 2జీ, 3జీ, 4జీ, 5జీ, 6జీ, 8జీ అంటూ సరికొత్త మొబైల్ ఫోన్లు వినియోగిస్తుండటంతో అందుకనుగుణంగా సెల్ టవర్లు ఏర్పాటు చేస్తూ సంస్థలు నిబంధనలను పాతరేస్తున్నాయి. సెల్ టవర్ల యాజమాన్యాలపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రజల అవసరాలు గుర్తించిన సెల్ టవర్ల కంపెనీలు మరిన్ని టవర్లను నిర్మిస్తున్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్, మహానగరాలకు పరిమితమైన సెల్ టవర్లు ప్రస్తుతం గ్రామాల్లో సైతం విస్తరిస్తున్నాయి. పట్టణాలకు దీటుగా నివాసిత ప్రాంతాలు, మేడల పైన సెల్ టవర్లు ప్రత్యక్షమవుతున్నాయి.

మనుగడకు విఘాతం

సెల్ టవర్ల నుంచి వస్తున్న రేడియేషన్ ప్రాణుల మనుగడకు విఘాతం కలిగిస్తుంది. ఫోన్ వాడుతున్న వారితో పాటు వినియోగించని వారికి సైతం ఈ రేడియేషన్ ప్రభావం ఉంటుంది. నియోజకవర్గంలో వివిధ కంపెనీలకు చెందిన సుమారు 75 వరకు టవర్లు ఉన్నాయి. వాటిలో బీఎస్ఎన్ఎల్‌కు చెందిన టవర్లు రేడియేషన్ నిబంధనలకు లోబడి ఉండగా.. మిగితా నెట్‌వర్క్‌లు నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రజలు, పక్షులు, పశువులు దుష్ప్రభావాలకు లోనవుతున్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మానవుల నిర్మాణంలో కణజాల వృద్ధి తగ్గడం, డీఎన్‌ఏ ప్రభావితం కావడం, స్త్రీలకు గర్భస్రావాలు జరిగే అవకాశం కూడా ఉంటుంది. ఈ రేడియేషన్ వల్ల వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, నిద్రపట్టకపోవడం, చిరాకు, కోపం, డిప్రెషన్, బలహీనంగా ఉండటం, త్వరగా అలసిపోవడం, వినికిడి లోపం, కంటి క్యాన్సర్, ఏకాగ్రత లోపించి జ్ఞాపక శక్తి తగ్గడం, బ్రెయిన్ ట్యూమర్, గుండె జబ్బులు వంటి రోగాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పశు, పక్షాదుల్లో అయితే పాల దిగుబడి తగ్గిపోవడం, సంతానోత్పత్తి తగ్గిపోవడం వాటి ప్రవర్తనలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుంటాయి.

ప్రమాదం సంభవిస్తే

సెల్ టవర్లను పాఠశాల డాబాలపై, నివాస గృహాల మధ్య ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధం. భూమి కంపించినా, గాలితో కూడిన వాన వచ్చినప్పుడు అవి కూలితే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరుగుతుంది. నియోజకవర్గంలో నివాస గృహాల మధ్య ఒక టవర్‌పై వివిధ కంపెనీలకు చెందిన పరికరాలు అమర్చడంతో అక్కడ అధిక రేడియేషన్ వెదజల్లుతోందని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. చాగల్లు మండలం ఊనగట్లలో గతంలో జనావాసాల మధ్య నిర్మిస్తున్న సెల్ టవర్‌ను స్థానికులు అడ్డుకున్నారు. పలు గ్రామాల్లో ఇటువంటి సంఘటనలు చోటుచేసుకున్న దాఖలాలు ఉన్నాయి. టవర్ల రేడియేషన్ ప్రభావంతో నియోజకవర్గంలో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారులు సెల్ కంపెనీల ప్రతినిధులతో చేతులు కలిపి విచ్చలవిడిగా టవర్లు ఏర్పాటు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



చాగల్లులో జనావాసాల మధ్య ఉన్న సెల్ టవర్



బ్రాహ్మణగూడెంలో భవనంపై ఏర్పాటు చేసిన టవర్

ఆ ప్రభావం కచ్చితంగా ఉంటుంది

సెల్ టవర్లు, సెల్‌ఫోన్‌తో రేడియేషన్ ప్రభావం కచ్చితంగా ఉంటుంది. చిన్న పిల్లలకు ఫోన్ అందుబాటులో ఉంచకూడదు. గర్భిణులు సెల్‌ఫోన్ వినియోగించడం పూర్తిగా తగ్గించాలి. వారు త్వరగా రేడియేషన్ ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉంది. వీలైనంత వరకు సెల్ టవర్లకు దూరంగా నివాసముండాలి.

– డాక్టర్ నిశిత, పీహెచ్‌సీ వైద్యాధికారి, బ్రాహ్మణగూడెం.

టవర్లను తనిఖీ చేయించాలి



ప్రభుత్వం సాంకేతిక నిపుణులతో అన్ని సెల్ టవర్లను తనిఖీలు చేయించాలి. రేడియేషన్ నియంత్రణలో ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలి. టవర్ ప్రభావంతో ఆరోగ్యం క్షీణించిందని నిర్ధారణకు వస్తే నష్ట పరిహారాలు ఇప్పించాలి.

– బొర్రా రజనీప్రసాద్, మీనానగరం.

శ్మశానానికి వెళ్లేదెలా?

చాగల్లు: మండలంలో మీనానగరంలో శ్మశాన వాటికకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించడానికి ఈ మార్గంలో వెళ్లేందుకు నరకం చూస్తున్నామని స్థానికులు చెబుతున్నారు. శనివారం గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందడంతో మృతదేహాన్ని శ్మశానానికి తరలించడానికి చనిపోయిన వ్యక్తి కుటుంబీకులు నానా అవస్థలు పడ్డారు. రైతులు పంట పొలాల్లో, చెరువులో నీరు ఈ రోడ్డుపైకి రావడంతో బురదలోనే వెళ్లాల్సి వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు అభివృద్ధి చేయడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



మీనానగరంలో బురదమయమైన శ్మశానం రోడ్డు

తానేటి వనిత పరామర్శ

దేవరపల్లి: మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమ శిక్షణా కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత శనివారం నియోజకవర్గంలోని నల్లజర్ల, గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో పర్యటించి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. దుద్దుకూరులో ఇటీవల మృతి చెందిన కోమటి పద్మ కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాపోలు వెంకట కృష్ణారావు, పార్టీ నాయకులు నిమ్మగడ్డ కృష్ణారావు, జ్యేష్ఠ ప్రదీప్, గుత్తికొండ అచ్యుతరావు, పంది పేర్రాజు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



దుద్దుకూరులో కోమటి పద్మ కుటుంబీకులను పరామర్శిస్తున్న తానేటి వనిత

విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం

నల్లజర్ల: విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ భవనానికి స్థలం సమకూర్చుతానని నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు రావూరి వెంకటరమణ హామీ ఇచ్చారు. ఆ సంఘ సమావేశం శనివారం సొసైటీ సమావేశ మందిరంలో అధ్యక్షుడు ఐవీ సత్యం అధ్యక్షతన జరిగింది. కుటుంబ పెన్షనర్ విజయరాగిణి తన భర్త మల్లిపూడి వెంకటేశ్వరావు జ్ఞాపకార్థం కంప్యూటర్ ప్రింటర్ సంఘానికి బహూకరించారు. ఆకీరా కంటి ఆసుపత్రి మేనేజరు నారాయణరావు పాల్గొని కంటి వ్యాధుల చికిత్సా విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు పాకలపాటి వెంకటేశ్వరావు, సంఘ గౌరవ అధ్యక్షుడు ఉన్నమట్ల వెంకటేశ్వరావు, కామేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

నల్లజర్ల: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవం– 2025 సందర్భంగా నల్లజర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో 16 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు, నలుగురు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రత్యేకంగా పోషకాహారం అందిస్తున్నా, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా రక్తహీనత వంటి అంశాలు వెంటాడుతున్నాయన్నారు. దీంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, బాలికలను అప్రమత్తం చేసే దిశగా రక్తహీనత, పోషకాహార లోపాలను నివారించేందుకు ఆరోగ్యకర జీవన శైలిని ప్రోత్సహించేందుకు ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆహార పదార్థాల ఎగ్జిబిషన్ ప్రదర్శించారు. కార్యక్రమంలో గోపాలపురం మార్కెట్ కమిటీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, సొసైటీ చైర్మన్ రావూరి వెంకటరమణ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీడీపీఓ మమ్మీ, మూడు మండలాల సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సారా నేరస్తురాలిపై పీడీ యాక్ట్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నార్త్‌స్టేషన్ పరిధిలో రామదాసుపేటకు చెందిన పొట్నూరి దేవిపై కలెక్టర్ ఉత్తర్వుల మేరకు పీడీ యాక్ట్ అమలు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు. కొంతకాలంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న వ్యక్తులపై నార్త్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ శాఖ అధికారుల సమన్వయంతో కఠిన చర్యలు చేపడుతున్నామన్నారు. రామదాసుపేటకు చెందిన పొట్నూరి దేవి గతంలో కూడా అనేక కేసులలో అరెస్ట్ అయి, తరచూ నేర చర్యలకు పాల్పడుతున్నట్టు గుర్తించామన్నారు. ఇటువంటి వ్యక్తుల వల్ల సమాజంలో చట్ట వ్యవస్థ దెబ్బతినకుండా, ప్రజల ప్రాణభద్రతను కాపాడే ఉద్దేశ్యంతో ఈ చర్య తీసుకున్నట్టు చెప్పారు. అక్రమ మద్యం తయారీ, రవాణాపై ఎక్సైజ్, పోలీసు శాఖల సహకారంతో కఠిన చర్యలు కొనసాగుతాయన్నారు. ప్రజలు కూడా ఇటువంటి కార్యకలాపాలను గమనించిన వెంటనే అధికారులు తెలియజేయాలని కోరారు. అక్రమ మద్యం వల్ల ప్రాణనష్టం, ఆరోగ్య నష్టం జరుగుతుందని, ఇలాంటి కార్యకలాపాల నుంచి దూరంగా ఉండాలని హెచ్చరించారు.

క్లుప్తంగా

పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు దగ్ధం



ఆవపాడులో కొబ్బరి చెట్టుపై పడిన పిడుగు

నల్లజర్ల: మండలంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆవపాడులో పిడుగుపడి కొబ్బరి చెట్టు దగ్ధమైంది. అనంతపల్లిలో తప్ప అన్ని గ్రామాల్లో భారీ వర్షం నమోదైంది. చాలా గ్రామాల్లో వివాహాలు ఉన్న దృష్ట్యా బంధువులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ



పుంతలో ముసలమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించిన తానేటి వనిత

నల్లజర్ల: నబీపేటలో శనివారం గ్రామ దేవత పుంతలో ముసలమ్మ అమ్మవారి నూతన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ హోంమంత్రి తానేటి వనిత హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పూలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. సర్పంచ్ గోతం సత్య లక్ష్మీ కృష్ణా యాదవ్ ఆమెకు స్వాగతం పలికారు. ఆమె వెంట మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బంక అప్పారావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నక్కా పండు, ప్రగడ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా అవకతవకలపై సంతకాల సేకరణ

నిడదవోలు: కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త నిరసనలో భాగంగా పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ఓటు చోరీకి మద్దతుగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ మేడవరపు భద్రం దొర, పార్టీ అధ్యక్షురాలు దారపురెడ్డి సుజాత, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాకి కిషోర్, బండి అభిషేకుడు తదితరులు పాల్గొన్నారు.

నాణేలతో తులాభారం

దేవరపల్లి: స్థానిక బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో గ్రామానికి చెందిన కడలి రమేష్, గాయత్రిదేవి దంపతుల కుమారుడు రుద్రకుమార్‌ను శనివారం పటికబెల్లం, చిల్లర నాణేలతో కుటుంబ సభ్యులు తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటకు చెందిన బేతాళ రాధకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన సీఎం సహాయనిధి రూ.65,000ల చెక్కును శనివారం కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు.

17 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

నల్లజర్ల: ప్రకాశరావుపాలెం వైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ డెవలపర్స్ ట్రైనింగ్ సంస్థ క్యూస్పైడర్‌కు 17 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ యం.అరవిందకుమార్ తెలిపారు. శనివారం జరిగిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ప్రతినిధులు బి.తేజస్విని, నిఖితలు టెక్నికల్ గ్రూప్ రౌండ్స్, గ్రూప్ డిస్కషన్ నిర్వహించి ఈ ఎంపికలు చేశారన్నారు. తమ కళాశాలలో విద్యార్థులకు మూడో సంవత్సరం నుంచే ప్రఖ్యాత క్యాంపస్ రిక్రూట్ సంస్థలచే శిక్షణ నిర్వహిస్తున్నట్టు కరస్పాండెంట్ ఆకుల త్రిమూర్తి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

వరుడికి ఆశీస్సులు



వరుడు దుర్గారావును ఆశీర్వదిస్తున్న మాజీ హోంమంత్రి తానేటి వనిత

నల్లజర్ల: అనంతపల్లిలో ఓ సామాన్య కార్యకర్త నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి. గత 36 ఏళ్లుగా తొలుత కాంగ్రెస్ అనంతరం వైఎస్సార్ సీపీకి ప్రతి ఎన్నికల్లో ఓ పెద్ద జెండా పట్టుకొని ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా పార్టీ గెలుపు ఆవశ్యకతను ఓటర్లకు వివరిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవారు. ఆయన కుమారుడు దుర్గారావు వివాహం జరుగుతోందని తెలుసుకున్న మాజీ హోంమంత్రి తానేటి వనిత శనివారం వారింటికి వెళ్లి వరుడిని ఆశీర్వదించారు. ఓ సామాన్య కార్యకర్త ఇంట్లో శుభ కార్యక్రమానికి హాజరవడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని వనిత ఈ సందర్భంగా అన్నారు. ఆమె వెంట ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బంక అప్పారావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నక్కా పండు తదితరులున్నారు.

మానవత సేవలు మరింత విస్తృతం చేయాలి



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సూర్యనారాయణ, సభ్యులు

గోపాలపురం: మండలంలో మానవత స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని ఉమ్మడి జిల్లా మానవత అధ్యక్షుడు ఖండెపు సూర్యనారాయణ అన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జీబీ పాఠశాలలో ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పేదలకు తక్షణ సహాయం అందించడం, పలు సేవా కార్యక్రమాలు చేపట్టి సంస్థను జిల్లాలో ప్రథమ స్థానంలోకి రావడానికి కారకులైన మండల మానవత సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, మండల అధ్యక్షుడు రాపాక ఫణికిషోర్, జుత్తిగ సూర్యచంద్రం, జోడాల వెంకటేశ్వరరావు, గోపాలపురం మండల నాయకులు పాల్గొన్నారు. సుమారు 650 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అధ్యక్షుడు ఫణి కిషోర్ తెలిపారు.

అన్నసమారాధన

తాళ్లపూడి: మండలంలోని తాడిపూడిలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం వద్ద దసరా మహోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం అన్నసమారాధన నిర్వహించారు. విజయదశమి ఉత్సవాలు పూర్తైన తరువాత ప్రతి ఏడాది నిర్వహించే అన్నసమారాధన కార్యక్రమాన్ని ఉత్సవ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. సుమారు 2 వేల మంది గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నామ వెంకట సుబ్బారావు (కొండబాబు), ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో అందని వైద్యం

- కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు
- 45 రోజుల కార్యక్రమానికి శ్రీకారం

నిడదవోలు: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ఉచితంగా నాణ్యమైన వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉండగా.. ఏకకాలంలో 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారని, అయితే కూటమి ప్రభుత్వం వాటి ప్రైవేటీకరణ ద్వారా వాటి ఫలాలను పేదలకు అందకుండా దూరం చేసే కుట్ర చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జి.శ్రీనివాసనాయుడు ఆరోపించారు. కూటమి ప్రభుత్వ తప్పుడు ఆలోచనలను నిరసిస్తూ పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ ఉద్యమ పోస్టర్‌ను శనివారం పట్టణంలో పార్టీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. కోటి సంతకాల కార్యక్రమంలో పార్టీ మాత్రమే కాకుండా సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న మేధావులు, ప్రజాసంఘాలు, రైతు సంఘాలు, కార్మిక సంఘాలు పాల్గొనాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు, ప్రజా సంఘాలతో రాష్ట్రంలో ప్రజా ఉద్యమం 45 రోజులపాటు కొనసాగుతుందన్నారు. నియోజకవర్గం నుంచి 60 వేల సంతకాలు లక్ష్యంగా పని చేయాలని, ప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసి సంతకాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో నిడదవోలు, కొవ్వూరు పరిశీలకులు గిరజాల బాబు మాట్లాడుతూ, ఈ నెల 10 నుంచి నవంబర్ 23 వరకు రచ్చబండ, సంతకాల సేకరణ, అక్టోబర్ 28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలనే అధిష్ఠానం నిర్ణయం మేరకు ప్రతి ఒక్కరూ సంతకాల సేకరణను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బూరుగుపల్లి సుబ్బారావు, కౌన్సిలర్లు ఆకుల ముకుందరావు, దాకే అనిల్‌కుమార్, విద్యార్థి విభాగం నాయకులు మానుకొండ చంద్రబాబు, ఎస్‌కే ఛాన్‌భాషా, గజ్జరపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పేద, మధ్య తరగతి ప్రజలకు అందాల్సిన వైద్యం అందక ప్రాణ సంకటంగా మారిందని కొవ్వూరు నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. వేగేశ్వరపురంలో శనివారం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిల్లులు చెల్లించకపోవడంతో కార్పొరేట్ హస్పిటళ్లు ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశారన్నారు. రూ.3వేల కోట్లకు పైగా బకాయిలను కూటమి సర్కార్ పెట్టిందన్నారు. నాటి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆరోగ్యశ్రీ సేవలు బలోపేతం చేసి అందించామన్నారు. పైగా 2014– 2019 సమయంలో పెట్టిన రూ.700 కోట్ల బకాయిలను సైతం తీర్చామని గుర్తు చేశారు. మరో పక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ సంస్థలకు ఇచ్చే కుట్ర చేస్తున్నారన్నారు. దీంతో పేద వాళ్లకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి గూడా విజయరాజు, పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దూసనపూడి బగవాన్, ముఖ్య నాయకులు శూలా పోశియ్య, కొమ్మిరెడ్డి నారాయణరావు, శీర్ల బ్రంహానందం, గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

వేగేశ్వరపురంలో మెడికల్ కాలేజీలు ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడంపై కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మెడికల్ కాలేజీలను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడం వల్ల జరిగే నష్టాలను ప్రజలకు వివరించారు.



వేగేశ్వరపురంలో కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న తలారి వెంకట్రావు, నాయకులు



కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాసనాయుడు

బార్ తొలగించాలని మహిళల నిరసన



బార్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

నిడదవోలు: పట్టణంలోని సుబ్బరాజుపేట దళితవాడలో నివాస ప్రాంతాల మధ్య ఏర్పాటు చేసిన చైతన్య బార్ అండ్ రెస్టారెంట్‌ను తొలగించాలని శనివారం స్థానిక మహిళలు ధర్నా చేపట్టారు. దళితుల కుటుంబాలు విచ్ఛిన్నమయ్యేలా బార్లు ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. మహిళా సాధికారత, దళితుల అభివృద్ధి అందరికీ విద్య, స్త్రీల ఆర్థిక ఆరోగ్య రక్షణ అని చెప్పుకునే కూటమి ప్రభుత్వానికి బార్లు ఏర్పాటు చేయడం తగదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బార్ తొలగించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దయామణి, పమ్మి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నిడదవోలు రూరల్: ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి. ఒకే బడిలో కలిసి చదువుకొని విడిపోయిన ఆ విద్యార్థులు 9 ఏళ్ల అనంతరం కలుసుకుని ఆత్మీయతానురాగాలు పంచుకున్నారు. వారిలో కొందరు ఉన్నత విద్యావంతులు కాగా, మరి కొందరు వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. మండలంలోని సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 2016–17 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు భానుమతి, ఇందిరాదేవి, కనకదుర్గ, రమణమ్మ, సూర్యకాంతం, ఆలీ, సోమేశ్వరరావు, గౌతమ్ అశోక్, సాయి, కృపావరంలను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు ముప్పిడి కిట్టు, షేక్ ఆలీఅబ్బాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుంతలమయంగా రోడ్డు



ప్రమాదకరంగా దేవరపల్లి- పల్లంట్ల రోడ్డు

దేవరపల్లి: మండలంలోని పలు రహదారులు గోతులతో ప్రమాదకరంగా ఉన్నాయి. దేవరపల్లి–పల్లంట్ల రోడ్డులో పోలవరం కుడి కాలువ గట్టు మలుపు వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమై పెద్దపెద్ద గోతులు పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోవడం వల్ల గోతులు పడి ప్రమాదకరంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు రోడ్డును పరిశీలించి గోతులు పూడ్చి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 23729 (కొవ్వూరు) 90100 51493 (నిడదవోలు)

79956 78554 90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com